# రష్యాకి జలుబు చేసింది

"నిమ్మకాయ ఎంత?" "రూపాయి పావలా!"

'ఏమిటి- వెంకటప్పయ్య నిమ్మకాయల తట్టకేసి నిమ్మకాయలు అమ్మేవాడి కేసి చూశాడు. కొంటేకొను లేక పోతే ఫో అనే లుక్ వాడిలోవుంది. నిమ్మకాయలమ్మేవాడు చూస్తే ఆ మాసిన చినిగిన బట్టలూ వాడూ రూపాయి పావలాకి కాయ అమ్మి నిమ్మకాయల కేపిటలిస్ట్ అనిపించుకునేవాడిలా లేడుకాని మధ్య తరగతి వాళ్లను బూర్జువా ముండాకొడుకుల్లా పరిగణించి నిమ్మకాయలు అమ్మకుండాను అమ్మి ఏడిపించుకుతినేవాడిలాగున్నాడు. వెంకటప్పయ్య నిమ్మకాయల్ని తీసి నలిపిచూస్తూ బేరమాడపోయాడు. 'ముందక్కడ ఎట్టేసి...ఎల్లెల్లు' అన్నాడు ఎప్పుడేనా నిమ్మకాయలు కొన్నమొహమేనా అన్నట్లు నిరాదరణగా చూస్తూ.

'నువ్వు దేవుడ్ని నమ్ముతావా?' అని వెంకటప్పయ్య నిమ్మకాయల వాణ్ని సందేహిస్తూ అడిగాడు. వాడు కనక భగవంతుని మీద విశ్వాసం కలవాడయితే అణా, పావలా, అర్థా చేసే నిమ్మకాయని రూపాయి పావలాకి అమ్మగలడా అని వెంకటప్పయ్య జిజ్ఞాస. వాడు టపీమని-

'దేవుడు దేవుడే-నిమ్మకాయలు నిమ్మకాయలే, అన్నాడు. ఆధ్యాత్మికాన్ని భౌతికాన్ని కలపకుండా దేనికదే పరమాత్మ అన్నది వాడి ఫిలాసఫీ. నిమ్మకాయలు ఉన్న వాడు నిమ్మకాయలు లేని వాణ్ని ఇలాగే దోపిడీచేస్తాడన్నది స్పష్టమవుతున్నది వెంకటప్పయ్యకి. జనంలోంచి జనంలోకి వెళ్ళందే మానవసంబంధాలు బోధపడవని వెంకటప్పయ్యకు గుర్తొచ్చింది.

అతనియింటి దగ్గర కాయల్స్ మాడిపోయిన ఫ్యానొకటున్నది. కరెంట్ సప్లయిల్లో తగ్గడాలు హెచ్చడాలు ఎక్కువకావడం వలన ఎలక్ట్రిక్ సామాన్లన్నీ కృష్ణార్పణం

అవుతూవచ్చాయి. ఫ్యాను బాగుచేయించమని భార్య దెప్పుతూ ఉంది. సరేనని కుక్కని పశువులాసుపత్రికి తీసికెళ్ళినట్లు ఫ్యాన్‌ని ఓ మెకానిక్కు దగ్గరకు తీసుకెళ్ళి దానికి వచ్చిన కష్టం తన కష్టం ఏకరువుపెట్టుకున్నాడు. అంతా విని ఆ సాంకేతిక నిపుణుడు అడ్వాన్సిచ్చి అక్కడ పెట్టి వెళ్ళమన్నాడు. నేనెదురుగుండా కూర్చుంటా–బాగుచేసిఇవ్వలేరా అన్నాడు వెంకటప్పయ్య. బోల్డు బిజీ అల్లా కుదరదండీ అన్నాడువాడు. యాభై ఇచ్చి నానాజాగ్రత్తలూ చెప్పి వెంకటప్పయ్య యిలా రోడ్డు మలుపు తరిగాడోలేదో 'మాస్టారూ–మాస్టారూ ఎక్కడ్నుంచీ–ఏవిటి– ఎందుకూ అంటూ కీచురాయ్ తగిలాడు. వెంకటప్పయ్య–కీచురాయిదీ సేమ్ డిపార్ట్‌మెంట్. సేమ్ డిపార్ట్‌మెంటు వాడు మరోసేమ్ డిపార్ట్‌మెంటు వాడ్నిచూడగానే గుమ్మడికాయ మరోగుమ్మడి కాయను చూసి పులకించినట్లు పులకించి పోయి చేయిపుచ్చుకుని ఎటూ కదలనివ్వకుండా ఆడించేస్తూ 'చాయ్ తాగుదామా' అని రోడ్డు పక్కనవున్న పాన్‌షాపు కమ్ బేకరీ కమ్ టీకొట్టు వైపు ఈడ్చుకెళ్లాడు. కీచూ యిది సన్నగా పెద్ద గొంతు–అతను ఎప్పుడూ సెమిసూట్‌లో ఉంటాడు. తెలియని వాళ్లు అతను ఏ బ్యాంక్ ఆఫీసరో సబ్ కలెక్టరో అనుకుంటారు. అలా అనుకుంటే అతను ఎవర్నీ మాట్లాడనివ్వడు. హార్మనీలో కీచుగొంతుకవాళ్ల శృతిని కలపడానికి కొన్ని మెట్లువుంటాయి –అవినొక్కితే 'కీ' మంటూవస్తుంది అరుపు. వెంకటప్పయ్య ఫ్యాన్ సంగతి గురించి చెప్పగానే 'గురుగారూ వాడు మెకానిక్‌కాదు. మీ ఫ్యాన్ తీసుకుని ఎవడిచేతో బాగుచేయించి కమీషన్ కొట్టేస్తాడు. అంచేతే మిమ్మల్ని ఫ్యాన్‌ను అక్కడ వదలి అడ్వాన్సిచ్చి వెళ్ళమన్నాడు. ఒకసారి రిపేర్ చేశాక మరి రిపేరీక్కూడా పనికిరాకుండా ఫామిలీ మ్యూజియంకి చేర్చాల్సిందే గురూ గారూ' అని అన్న చేతిబాంబులాటి ప్రకటన విసిరేశాడు. కీచురాయ్ చెప్పిన నిజానికి వెంకటప్పయ్య రైస్‌కుక్కర్‌లో పడ్డ బంగాళాదుంపలా ఉడికి పోయాడు. వెంకటప్పయ్యకు తన తెలివి తక్కువ తనంమీద ముందు కోపం వచ్చినా, మాయాశశిరేఖ రూపం దాల్చిన మెకానిక్ కమ్ ఎలక్ట్రీషియన్ వేషధారి మీద కంటే ఆ అప్రియ సత్యాన్ని అంత ఆనందంగా బయటపెట్టిన కీచురాయ్ మీద చిరాకుపుట్టింది. అది గ్రహించకుండా ఇతగాడు 'ఇప్పుడు ఇదో కల్చర్ బయల్దేరింది గురూజీ' అని వీపు మీదోచరుపు చరిచి 'కప్పు టీ తాగడం ఎప్పుడయినా చూశారా' అని నవ్వి టీ కొట్టు మూలన నిలబడి చప్పరిస్తూ లొట్టలువేస్తూ టీ తాగుతున్న ఓ ఆసామీని చూపించి 'నాకలాచప్పుడు చేస్తూ టీ తాగేవాళ్లంటే అసహ్యం. కొందరు చారూ మజ్జిగ అన్నం కూడా లొట్టలేస్తూ తింటారు' అని ఆగి మరేదో జ్ఞాపకం వచ్చినవాడిలా తల గోక్కుని 'మాస్టారూ మీరు చూశారో లేదో జ్ఞానలింగం అని ఓ లెక్చరర్ ఉన్నాడు మాకొలీగ్–వాడు బార్లో కెళ్లి విస్కీ తాగడం చూడాలి. ఆ పుక్కిలింత. మంచినీళ్ళు పుక్కిలించినట్లు పుక్కిలిస్తాడు విస్కీ. గుణశేఖర్ రావని మరోడున్నాడు, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్లో–వాడు అమలాపురం వెళ్లినా అనకాపల్లి వెళ్లినా

బస్సులో వెళ్తాడు. రైలంటే వాడికి పడదు. బస్సు బెస్టంటాడు. అంటాడా? వెళ్ళినపుడల్లా కూడా స్టీలు మర చెంబోటి తీసుకెళ్తాడు. అందులో సోడాలు కలిపిన విస్కీ పోసి దారిలో ఇబ్బంది పడకుండా దాహం పుచ్చుకుంటాడు. ఎలావుంది మన వాడి స్ట్రాటజీ? ఏవిటి అలా డల్‌గా ఉన్నారు?' అని జోకేశాడు. వెంకటప్పయ్య 'ఇప్పుడు నాకెందుకీ బాదుడు' అన్నట్లు మొహం పెట్టాడు. అకాలీజోక్స్ భరించడం కష్టం.

'ఫ్యాన్ వాడి దగ్గర పెట్టుకుని యాభై వంద ఇలా వాయిదాల మీద కొత్త ఫ్యాన్ ఖరీదు వసూలు చేస్తాడని మీరు బాధపడుతున్నారా లేక -' వెంకటప్పయ్య కీచురాయ్ రెండుచేతులూ పట్టుకుని ఈ వేళనేను దొరికానేవిటి నీకు' అని బావురుమన్నంత పనిచేశాడు.

'చూడండి-ఇప్పుడు చాలా మంది మనవాళ్లు డబ్బు సంపాదించే తెలివితేటలు నేర్చేరండి. హెల్త్‌కేర్ అనో మెడికేర్ అనో పెద్ద పెద్ద రోగనిర్ణయం చేసే ఆరోగ్యశాలలు స్థాపించడం. అందులో డాక్టర్లని చవగ్గా అప్పాయింటు చెయ్యడం. పెద్ద డాక్టర్లని కన్సల్టింగుకని పిలిచి వారికి ఫీజులివ్వడం. ఇది లాభసాటి భారీపరిశ్రమ. ఓ మందు నివ్వడం ఇంజక్షనివ్వడం వైద్యంతో వీళ్ళకేమీ నిమిత్తంలేదు. సామాన్యులకి పేదవాళ్ళకి ఏవీ అందుబాటులో ఉండవు. అట్లాగే ఈ ఎలక్ట్రీషియన్‌కాని వాడు స్కూటర్ మోటర్లు ఏవీతెలీని వాడు వర్క్‌షాపులు గారేజీలు పెట్టి మెకానిక్కులకి జీతాలిచ్చి పని నడిపిస్తాడు. మీ వస్తువు బాగవటం పాడవటంతో వాడికేమీనిమిత్తం లేదు. ఇది హైదరాబాద్‌లో స్టయిలు-బార్బరుషాపులు, లాండ్రీలు క్షురకర్మ రజకులు శాస్త్రజ్ఞులే నడుపుతున్నారా? బ్యాంకులోన్లు తీసుకుని ఎవరైనా నడపవచ్చు. సొమ్మొకడిది సోకొకడిది. పురోహితుల్లో చూడండి. హెడ్‌ప్రీస్ట్ ఉంటాడు. శుభానికయినా అశుభానికయినా హోల్‌సేల్‌గా మాట్లాడుకుంటాడు. అన్నీ అతనే సప్లయి చేస్తాడు. పీటలూ చాటలూ విసనకర్రలూ వగైరావగైరా ఛార్జిచేస్తాడు. అతని దగ్గర అసిస్టెంట్లు ఉంటారు. వాళ్ళకి అప్పగిస్తాడు డ్యూటీలు. మాపేటలో పౌరోహిత్యం మీద మూడు నాలుగు మేడలు కట్టిన వాళ్లున్నారు. డబ్బు ఎక్కడ నుంచయినా పుట్టించవచ్చు. తెలివితేటలుండాలే కాని-' వెంకటప్పయ్య హతాశుడై పోయాడు. అతనికి కీచురాయిని ఎలా ఒదుల్చుకోవాలో తట్టలేదు.

ఎవరో పాడెకట్టిన శవాన్ని మోసుకుని చిల్లర పైసలు ఎగరేస్తూ వెనక కుర్రాళ్ళు చావుమేళానికి గెంతుతూ గుంపుగావస్తున్నారు. 'ఇది మాయాకాయము నరుడా' అని పాడుతున్నారు. 'తొమ్మిది ధర్వాజాలు కిటికీలూ-యిది మాయాకాయము నరుడా' అని వాళ్ళు పాడుతూ పాటలో లేని చోట వొత్తులు పెడుతూ గెంతుతున్నారు. వెంకటప్పయ్య వాళ్ళలో కలిసి పోయాడు వెనక్కు చూడకుండా. గురువుగారూ గురూజీ ఇలా కేకలుపెడుతూ ఇటు అటు చూశాడు కీచురాయి. కీచురాయికి శవ వాహకులు వాళ్ల కేకలు కంపరం

పుట్టించాయి. ఆ వైపు ఆ గందర గోళంలో ఒక సిటీబస్సు స్లోడవునయి మళ్లీ ఊపందుకుంది. వెంకటప్పయ్య అది పట్టుకున్నాడు. ఎక్కేశాడు. కీచురాయి తనకు తెలీకుండా శవవాహకుల్ని కొంత దూరం ఫాలో అయి బుద్ధి తెచ్చుకు ఆగిపోయాడు.

అల్లంత దూరంలో ఒక వినాయకుడి గుడి చిన్నది ఉంది. కొత్తగా కట్టారోయేమో-లోపల పెద్ద దేవాలయం వుండొచ్చు. ఈ హిందువుల కిదో బ్యాడ్ హాబిట్ ఎక్కడపడితే అక్కడ గుడి కట్టేస్తారు అని విసుక్కున్నాడు.

జనం ప్రవాహంలా వస్తున్నారు పోతున్నారు. వెంకటప్పయ్య కనపడవచ్చునే ఆశతో కీచురాయి గణపతి దేవాలయంవద్ద కూచున్నాడు. ఎవరో అతని చేతిలో కొబ్బరి ముక్క పెట్టారు. అప్పుడతను దేవుడికేసి చూశాడు. ఆ వినాయకుడికి పంగనామాలు పెట్టివున్నాయి. తేరిపారచూశాడు. అంతా వైష్ణవ సంప్రదాయంలో వుంది. విఘ్నేశ్వరుడు ఈశ్వరుని కుమారుడు కదా- ఇతగాడికి పంగనామాలు ఎట్లా వచ్చాయి చెప్మా అని అతను విస్తుబోయి పక్కవారిని అడిగాడు. విష్ణ్వాలయం దగ్గర్లోనే వుంది. విష్ణ్వాలయం ముందరకట్టి తర్వాత దగ్గర్లోనే వినాయకుడి గుడి కూడా వాళ్ళే కట్టారు. వైష్ణవులు కట్టారు గనక వాళ్ళ రూల్సు ప్రకారం పంగనామాలు పెట్టారు. రేపు లెటర్సు టుది ఎడిటర్ కాలమ్‌లో దీని గురించి రాయాలి. వినాయకుడికి పంగనామాలేవిటాని? ఆముక్తమాల్యదలో కూడా కృత్యాదిని గణపతి ప్రార్థనతో గాక వెంకటపతిని, అనంతుని, గరుత్మంతుని, విష్వక్సేనుని బంగరుబెత్తాన్ని, విష్ణుమూర్తి ఆయుధాలను కీర్తిస్తారు. స్మార్తం మీద వైష్ణవం తిరుగుబాటే కదా! వెంకటప్పయ్య బస్సులో నిల్చున్నాడు. నిల్చునే కూచున్నవాడి చేతిలో పేపరుచూశాడు. అందులో గోదావరి పుష్కరాల ప్రకటన వుంది. ముఖం చిట్లించిచూశాడు. ముఖ్యమంత్రి చిరునవ్వులు చిందిస్తున్న బొమ్మ వుంది. పైగా ముఖ్యమంత్రి పుష్కరాలను ప్రారంభిస్తాడు అని వుంది. సెక్యులర్ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాల్సిన ముఖ్యమంత్రి 'సకల తీర్థసంగమం, పుష్కర స్నానం పవిత్రం' అంటూ పుష్కరాలను ప్రారంభించాడేమిటి? వెంకటప్పయ్య హేతువాది. నిరీశ్వరవాది. ఏవిటీ పని అని చెయ్యి గట్టిగా విసిరాడు. అది ఆ పత్రిక చదువుతున్న వాడి గుండుకుతగిలి వాడు కన్నెర్రజేస్తూ 'నన్నెందుకు కొట్టావన్నాడు' నేను నిన్ను కొట్టలేదు, నా చెయ్యి తగిలింది అంతే అన్నాడు వెంకటప్పయ్య. 'చెయ్యి తగిలినా విసిరినా దెబ్బ దెబ్బే నా నెత్తిమీద ఎందుకు కొట్టావ్' అని వాదించాడు. ఆ పేపర్లో ముఖ్యమంత్రి నవ్వుతున్నాడు అందుకు కోపం వచ్చింది. 'పుష్కరస్నాన మహత్యం పురాణకాలం నుంచి వేనోళ్ళ కొనియాడబడుతున్నది' అంటున్నాడు. ఇదేం గవర్నమెంటయ్యా ముఖ్యమంత్రి లేకపోతే పుష్కరాలు ప్రారంభంకావా? అని మళ్ళీ కోపంగా చేయివిదిల్చాడు-ఈసారి పేపరుచినిగి పోయింది.

'ఏవిటి నీ వేషం' అని సీట్లో అతనునిల్చున్నాడు.

'మాస్టారు ఇది చదవండి. ఇదేమిటి? జారీచేసినవారు; కమీషనర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–ఇక గవర్నమెంట్లు శంకుస్థాపనలు, సత్యనారాయణ వ్రతాలు పూజలు చేస్తే ఎట్లాగ?' అని మళ్ళీ చేయివిసరబోయి ఆగి, ఈ పదిరూపాయలు ఉంచు. ఏమీ అనుకోకు' అని ఆ నిల్చున్న ఆసామీని ఉద్దేశించి 'నేను నిన్నుకావాలనికొట్టలేదు. ఈ ప్రభుత్వాలు ఇలాగ అయ్యాయేమా అనే అక్కసుకొద్దీ అలా చేయి విదిల్చాను. నిజంగా గవర్నమెంటుని తల్చుకుని కొట్టాను అంతేనిన్ను కాదు' అని బస్సు దిగిపోయాడు తగువు పెంచకుండా. బస్సు దిగగానే రక్షాబంధన్ అని చేతులకు కట్టే రాఖీలు అమ్మేషాపులు కనిపించాయి. 'అన్నకు చెల్లి ధరింపచేసే పవిత్రబంధమ్ రాఖీ' అని వాడు అరుస్తున్నాడు బస్సులదగ్గరకు రోడ్డు మీద వెళ్లే వాళ్లను రాఖీలుకొనమని కుర్రాళ్లు మీద మీద కొస్తున్నారు. వెంకటప్పయ్య ముఖం ఎర్రబడింది. రోడ్ మీద అల్లరి పడటం యిష్టంలేక ఇంటికొచ్చాడు. ఇంటి దగ్గర శ్రావణమాసం ఆడమూక జమ అయ్యారు. మెళ్ళో గంధాలు పట్టుచీరల రెపరెపలు ఒక్కళ్ళ మాటా వినపడటంలేదు. నవ్వుతున్నారు, మాట్లాడుతున్నారు, అంతా విరగబడ్డపూలరెమ్మల్లా ఉన్నారు. వాళ్ళమధ్యలో అతని భార్యాలలామ దంచిమాట్లాడేస్తోంది. కాస్త అటుగా ప్రియపుత్రిక ఇటూ అటూ తిరుగుతూ అందరికీ మంచినీళ్ళు అందిస్తోంది.

ఇహ వెంకటప్పయ్య ఆవేదనని అణచుకోలేక పోయాడు. నాస్తికుడి నిర్వేదం బయటకి రాబోతోంది. జనం మధ్యకు దూకాడు.

'చూడండి మిస్. మిసస్, మీరంతా ఎందుకిలా అయిపోతున్నారో నాకర్థంకావడంలేదు. పొద్దున్నే తలారా స్నానం చేయడాలు, మడిగట్టుకోవడాలు, పూజలు, నిన్న వరలక్ష్మీవ్రతం. ఈవేళ శ్రావణ పూర్ణిమ. ఏక గర్భ సంజాత. అంటే ఒక తల్లికడుపునపుడితే తప్పసహోదరి అంటే సోదరిలౌతారు. మిగతా వారంతా స్త్రీలు. ఎవరికీ ఎవరూ ఏమీకారు. అటువంటప్పుడు–ఈరాఖీకట్టడం అంతాదండగ, కట్టేస్తే చెల్లెలయి పోతుందా? కాదు కాదు. ఇతను సోదరికి బహుమతులివ్వడం, ఆవిడ స్వీట్లు తినిపించడం ఇదంతా హిపోక్రసీ. మాయ.'

'పరాయి స్త్రీని చెల్లెలుగానో అక్కగానో భావిస్తే తప్పులేదు గదండీ'.

'పరాయిస్త్రీ అని మీరే అంటున్నారు. ఇహ చెల్లెలు అక్క అనేవి కల్పించుకున్న వరసలు కావా? పైగా ఇదో ముసుగు'.

'అంటే మీ ఉద్దేశం?'

'రాఖీ కట్టాక పైకి అన్నా చెల్లెలుగా కనిపిస్తూ ఎన్నినాటకాలైనా ఆడవచ్చుగదా'.

'ఛీ ఛీ ఛీ అవేం మాటలు'.

'సోషల్ రిలేషన్స్ మనకు ఎలా వీలయితే అలా మార్చుకోవచ్చు-రక్త సంబంధాలు అలాలేదు.'

'అయితే ఇవన్నీ మా కెందుకు చెబుతున్నారు మీరు?'

'మీరు అజ్ఞానంలో వున్నారని జాలితో'

'మీ జాలి మాకేం అక్కర్లేదు. మమ్మల్నిలా సంతోషంగా హాయిగావుండనివ్వండి'.

'ఈ నోములు వ్రతాలు పురుషులు మిమ్మల్ని శాశ్వతంగా మగవాడికి బానిసగా పడివుంచడానికి వేసిన ఎత్తులు-మీ మగాళ్ళు మా పెళ్ళాల్ని పతివ్రతలుగా ఉంచమని మీకు మల్లే నోములు వ్రతాలు చెయ్యరేమి?'

'ఏమిటేవిటి? మా మగవాళ్ళు పూజలు వ్రతాలు చెయ్యాలా?'

'చెయ్యరు వాళ్ళకిదంతా ఏవిటో తెలుసు. మీరు మాత్రం చెప్పుకింద తేలులా అణగిమణగి పడివుండటానికి-యీ మెళ్లో నగలు చేయించటాలూ-పట్టుచీరలు, బహుమతులు విలాసాదులన్నీ. దీని నిజం తెలుసుకున్న రోజున మీరు ఇలా ఉండరు నిజానికి'.

'ఎలా ఉంటాము?'

'కనకదుర్గా చండ సింహం జూలుదులిపీ ఆవులించినట్లు ఉంటారు?'

'మళ్ళీ దేవుడు దెయ్యం లేరంటూ కనకదుర్గా చండసింహందేనికి?'

'ఊరికే పోలిక కోసం చెప్పా.'

'అలారండి దారికి మా సరదాలు మావి. మా ఆనందాలు మావి. ఇందులోకి మీ హేతువాదం మూఢనమ్మకాలూ అంటూ ఏమీ అక్కర్లేదు. అన్నట్లు అన్నగారిని ఓ చిన్న కోరిక, అడుగుదామనుకుంటున్నాం, అడగచ్చా?'.

'అడగండి. మీకభ్యంతరం ఏవిటి?'

'మేమంతా గోదావరి పుష్కరాలకి రాజమండ్రి వెళ్తున్నాం. మీ ఆవిడ్ని మీ అమ్మాయిని మాతో పంపించాలి.'

వెంకటప్పయ్యకు గోతిలో పడ్డట్లయింది.

'ఈ స్నానాలూ పితృదేవతలకి తర్పణాలు ఇవన్నీ బోగస్. వేమన్న ఏమన్నాడూ... పి...తినెడి కాకి పితరుడెట్లాయెరా అని'.

'ఆ పుణ్యగోదావరి, ఆ వైభవం ఆ జనం చూడాల్సిందే. మీ వేమన పద్యం తర్వాత. అన్నట్లు గోదావరి స్నానం పుణ్యంకాదు అని రుజువుచెయ్యడానికి మీరు రాకూడదూ?'

'వచ్చి నన్ను గోదావరిలో దిగమంటారా?'

'మీరు దిగి ఈస్నానం వలన పుణ్యం ఏమీరాలేదు అని నిరూపించవచ్చుగదా?'

'అవుననుకో-మాటవరసకి థేమ్సు నదికి లండన్లో పుష్కరాలు రావేమి? నయగరాకి రావేమి? డాన్యూబ్ నదికి, రైన్ నదికి, మిసిసిపి, మిస్సోరీనదులకు పుష్కరాలు రావేమి?'

'సూర్యభగవానుణ్ణడగాలి. పైగా నదులు వాళ్ళు విహారాదులకుపయోగిస్తారు కాని స్నానాలు చెయ్యరు. స్నానాలు చేస్తే బిగుసుకుపోయి చస్తారేమో కూడా'.

'అదీ నిజమే. మీరు చెప్పిందంతా జాగ్రఫీలో వుంది. పుణ్యంగిణ్యం అంతానాన్సెన్స్. పుష్కరుట్ట–వాడు ఆనదిలో ఆ పన్నెండు రోజులే ఉంటాడుట. నమ్మం ఇదంతా.'

'ఇవన్నీ మాలాంటి పేరంటాల కెళ్ళే ఆడాళ్ళతో వాదించి ఏం ప్రయోజనం? రండి రాజమండ్రికి. మీరు కూడా మాతో స్నానం చేసి పుష్కరస్నానం ఏమీ పవిత్రం కాదని రుజువుచేస్తే బావుంటుంది?'

'బావుంటుందనుకో–అక్కడ వింటారా మనమాటలు'.

'వింటారా అంటూ నీళ్ళు నవిలితే ఎల్లాగ? మీ సెక్యులరిజం మీ నెహ్రూగారి వైజ్ఞానిక దృక్పథం చూపించొద్దూ–'

'నువ్వెవరో పేరంటావిడ్రస్సులో వున్న విజ్ఞాన ఖనిలా కనిపిస్తున్నావు?'

ఆవిడ ఆడపిల్లల కాలేజీలో పోలిటిక్స్ లెక్చరరని భార్యామణి ఇంట్రడ్యూస్ చేసింది.

'మరి ఏవిటీ కర్మ?' అన్నాడు వెంకటప్పయ్య.

'కర్మేవిటి? మన ఆచారాలు సంస్కృతి అంటే ఆవిడ పడిచస్తుంది.'

'ఇదే వచ్చింది ఈదేశంలో–చదువుకోనివాళ్ళ కంటే చదువుకున్నవాళ్ళే మూర్ఖులు' అని నాలిక్కరుచుకున్నాడు. ఆ పోలిటిక్స్ మిస్సుగారు 'ఎవరు మూర్ఖులో ఇక్కడ మాదగ్గరెందుకు? అక్కడెల్లాగూ తేల్తుంది. విజయం మీదే' అంది నవ్వుతూ.

ఇంతలో వాయినాలువచ్చాయి వెంకటప్పయ్యగారిఇంట్లోంచి.

'ఏవిటి వాయినాలు?' గుడ్లెర్రచేశాడు వెంకటప్పయ్య.

'అంటే సెనగలు తమలపాకులు అర్టిపండువగైరా వగైరా'.

'ఇవంటే నాకు అసహ్యం'.

పోలిటిక్సు మిస్సుగారు 'అసహ్యం ఎందుకండీ నాకు తెలియకడుగుతాను. నానేసిన సెనగలు సాతాళించుకుంటే బాగుంటాయి. అస్సలన్నిటి కంటె పేరంటానికి కెళ్ళి తెచ్చిన సెనగలు సాతాళించుకుంటే చెప్పలేం ఆ రుచి'.

'నేను మాట్లాడేది సాతాళించిన సెనగలగురించి కాదు'.

'మాస్టారూ మీ హేతువాదులకి సాతాళించిన సెనగల గురించేకాదు పేరంటంవాసన ఎంతావుంటోందోకూడా తెలీదు. అట్లతద్ది ఉండ్రాళ్ల తద్ది తెలుసా? ఆ అట్లు ఎంతరుచి? కుడుములు ఉండ్రాళ్ళు అవి ఎంతబాగుంటాయి? హేతువాదం వలన మంచిమంచి రుచులు తిళ్ల మిస్సవటం దేనికి? రథోత్సవానికి బెల్లం పరవాణ్ణం–ఇవన్నీ వదులుకుంటారా?'

'ఇలాంటి అలవాట్లు చేసి ఈ పురోహితులు అందర్నీ దోచుకుతింటున్నారు?'

'వాళ్ళు తప్ప మీరు అరిశలు పరవాణ్ణం ఏవీ ముట్టుకోరన్నమాట, హేతువాదులు తద్దినం గారెలు తినరా?'

'ఈ ఆచారాల్తో వాళ్ళు కొందరు నాశనమయిందిగాక మొత్తం సమాజాన్ని భ్రష్టు పట్టించారు.'

'మీరు సరిగ్గా కనిపెట్టారు. ఇవన్నీ ప్రజలకు తెలియచెయ్యడానికి మీరు పుష్కరాలటైమ్‌లో రాజమండ్రి రాకూడదూ?'

'రావచ్చు కాని మీ వాళ్ళు బార్బరస్ పీపుల్‌కదా నన్ను సరిగాట్రీట్ చేస్తారో చెయ్యరోనని'.

సరిగ్గా ఈ చర్చజరుగుతూండగా గురువుగారూ ఇంటికెలా వచ్చారు? మీ కోసం నేను బస్టాండు దగ్గర నుంచి ఊరువాడా గాలిస్తుంటే' అంటూ కీచురాయ్ పద్మవ్యూహలోకి అభిమన్యుడు ఛేదించుకవచ్చినట్లు వచ్చేశాడు. ఏ ఉపన్యాసాలకు ఏ వాక్ప్రవాహానికి ఎవరికి జంకి తప్పించుకుని బ్రతుకుజీవుడా అని ఇంటికివచ్చాడో ఆ కీచురాయ్ మళ్ళీ ప్రత్యక్షమయ్యేనరికి వెంకటప్పయ్య గతుక్కుమన్నాడు. పేరంటాళ్లనలా ఒగ్గేసి-'మీరేవయ్యారు? ఎక్కడాకనపడలేదే? వేర్ హాజ్ యుబీన్' అని దబాయించాడు. నిజానికి ఆడవాళ్ళ మధ్య ఇరుక్కుపోయిన వెంకటప్పయ్యకు దేవుళ్ళే కనిపించినప్పటికీ కీచురాయ్-దేవుడు లేదుగదా అని నిట్టూర్చాడు. హేతువాదులకి వేరే ఇడియం ఓట్లుండాలి. హిందువుల ఇడియమ్ హేతువాదులకి ఎలాపనికి వస్తుంది. ముసల్మానులకు వేరే ఇడియం వున్నప్పుడు హేతువాదులకి వేరే ఇడియం ఓట్లుండాలి. హిందువుల ఇడియమ్ హేతువాదులకి ఎలాపనికి వస్తుంది. ముసల్మానులకు వేరే ఇడియం వున్నప్పుడు హేతువాదులకి వేరేవుంటే తప్పేమిటి?

'గురువుగారూ యీ హైదరాబాద్ నిండా ఎక్కడ చూసినా యీ సమాధులేవిటండీ? నన్నడిగితే ముస్లిం బరియల్స్ చాలా కాస్ట్లీ మరియు కంబర్‌సం అంటాను. ఛస్తే అవతల పారెయ్యక దానికో సమాధి, అందులోకి ఓ బాక్స్ ఎంత కర్చండీ మీకు తెలియదుగాని, ఆ చచ్చిన వాడ్ని పాపం మంచిదుస్తుల్లో పడుకోపెట్టాలా-ఈలెక్కన కొన్నాళ్ళకి ఈ హైదరాబాద్‌లో అన్నీ సమాధులేవుండేట్లున్నాయ్'.

'పోన్లెద్దురూ వాళ్ళ సమాధుల జోలిమనకెందుకు?'

'మన కెందుకేవిటండీ? ఒక్కొక్క ముస్లింకి ఏడడుగులు ఇంటూ రెండడుగుల చొప్పున రిజర్వు చేయండి. ఎవరో అన్నట్లు నిజంగా ముస్లిము ఈదేశంలో పుట్టి పెరిగి ఈదేశంలో మరణించి ఎనిమిది గజాల భూమిని ఆక్రమించుకుంటున్నాడు. ముస్లిములు నిజమైన దేశ 'భక్తులంటాను గురువుగారూ'.

'ఒప్పుకుందాం నిజంగా వాళ్ళలో బ్రదర్‌హుడు గొప్పదంటాను. అన్ని కులాల్లోంచి వాళ్ళు లోపలికి రమ్మని ఆహ్వానిస్తారు.'

‘అంతెందుకు-మొన్న అంటే రీసెంట్లీ మావాళ్ళమ్మాయి తప్పుచేస్తే-అంతే. నువ్వు చనిపోయావనుకుంటాను ఇంట్లోకి రాకని నిర్దాక్షిణ్యంగా గెంటేశారు. అప్పుడా అమ్మాయి బిక్కు బిక్కుమంటూ నిల్చుంటే-మేం ఉన్నాం అంటూ సాయిబులు పల్లకీ పంపించి తీసుకెళ్ళి తమలో కలిపేసుకున్నారు. అదీ కంపోషన్ అంటే.-’

‘ఈ హరిజన్సూ దళితులూ నిమ్నజాతులూ ఏవిటండీ? మళ్ళీ గవర్నమెంటుకూడా వీరికి ఊరిబయట ఇళ్ళు కట్టిస్తుంది. వేరే హాస్టల్సు పెట్టి అందులో వేరేగా ఉంచుతుంది. మెయిన్‌స్ట్రీంలోకి వాళ్ళనెందుకు తీసుకురాకూడదూ? వాళ్ళంతా హిందువులాకారా? మీ ఇళ్ళలో కిరానిస్తారా? కలుస్తారా? కలిసితింటారా? తాగుతారా?’

‘గాంధీ గారు గట్టివాడండోయ్ వీళ్ళను హరిజన్సు అన్నాడు దళితులిప్పుడు హరిజన్స్ అంటే ఒప్పు కోవడంలేదు. అంబేద్కర్‌గారు వీళ్ళని బుద్ధిజంలో కలిసిపొమ్మన్నాడు’.

‘ఇండియాలో బుద్ధిజం ఎక్కడేడిసింది మీ వెర్రిగాని.’

‘అయితే నాకు ఓటితోస్తోంది. అగ్రవర్ణస్థులకి అపోజిట్ ఏమిటి?’

‘నిమ్న జాతులు’.

‘నోనో ఉగ్రవర్ణస్థులు. దళితుల్ని ఉగ్రవర్ణస్థులిగా తీసుకుంటే తప్పేటి? నాకో ఐడియా వచ్చింది. ఆగస్టు 15, 1947కి ముందువున్న ప్రార్థనాస్థలాలు యథాతథంగా వుండాలి. అన్నారు కదా.’

‘హిందువులు తమ దేవాలయాలన్నీ యథాపూర్వస్థితికి రావాలని, దేవాలయాలు పడగొట్టి, మసీదులు కడితే-మసీదులు మసీదుల్లాగుండాలని తాత్పర్యం.’

‘నాకీబిల్లు అర్థం కావట్లేదు గురూ గారూ’.

‘మసీదు పడగొట్టి ఎక్కడన్నా దేవాలయం కట్టారా మన వాళ్ళు.’

‘లేదు లేదు’.

‘అందుచేత దేవాలయాలు పడగొట్టి మసీదులు కట్టినవి అవి చెక్కుచెదరకుండా ఉంటాయి. మైనారిటీలు నిక్షేపంగా చీకూచింతలేకుండా ఉంటారన్నమాట.’

‘అయితే నాకోటి తోస్తుందండోయ్. ఆగస్టు 15, 1947 హాల్ మార్కేనా?’.

‘హాల్ మార్కే’.

‘అయితే ఆగస్టు 15, 1947 తర్వాత మతం మార్చుకుంటే ఏ కారణం చేతనైనా చెల్లదని ఓ బిల్లు తెస్తే-’.

‘దళితులూ నిమ్నజాతులూ అంతా మన తోనేవుంటారు.’

‘రోగంకుదుర్తుంది.’

‘ఎవరికి’.

‘మతం మార్పిడికి తహతహలాడేవారికి’.

నవ్వుకున్నారిద్దరూ. మనిషికి ఏదో ఒక మతం ఏదో ఒక కులం ఈ దేశంలో తప్పకుండా ఉండాల్సిందే. వెంకటప్పయ్య ఒకసారి పిల్లల స్కూలు ఎడ్మిషన్ ఫారాలలో నాకు మతం నిల్ కులం నిల్ నేను ప్రపంచ పౌరుడ్ని అని రాస్తే అంతానవ్వారు. నవ్వారు సరే పిల్లల్ని స్కూల్లో చేర్చుకోలేదు. తర్వాత చాలా కష్టమయింది. ఏమీ లేదు వెంకటప్పయ్య పెళ్లాం మరో అప్లికేషను పట్టికెళ్ళి తరువాత రాసిచ్చింది. వాళ్ళకుకావలసినట్టు.

రివిజనిస్టులు విప్లవానికి బహిష్టులు అని మావో కాలంలో వెంకటప్పయ్య ఛైర్మన్ మావో మా ఛైర్మన్ అని ఎగిరాడు. తర్వాత వారి రాజ్యంలో చైనీయులు టిబెటన్లను హింసిస్తుంటే మతం మత్తు మందు కాబట్టి బౌద్ధమైనా చైనాకి పనికిరానిది మనకూ పనికిరానిదే అనిపించింది. దలైలామాను ఆయన మతాలను ఆ సంప్రదాయాలనూ తెగతిట్టేవాడు. సోవియట్ యూనియన్‌కి దలైలామాను ఇప్పుడు ఆహ్వానించారనగానే వెంకటప్పయ్య రెచ్చిపోయాడు.

'ఏమిటండీ ఈరివిజనిస్టులు దలైలామాను రష్యాకి ఆహ్వానించడం'.

'అంటే టిబెటన్ల బౌద్ధిక సంస్కృతిని రష్యా గౌరవిస్తోంది. దలైలామా పీఠాధిపతి, గురువును పూజించటం విధాయకం.'

'కమ్యూనిస్టులకి మార్క్సు, లెనిన్‌లే గురువులు.

దలైలామా అంటే చైనా వాళ్ళకి పడదుగదా. ఆయన్ని ఆహ్వానించడంలో ఉద్దేశం?'

సంఘం శరణం గచ్ఛామి ధర్మం శరణం గచ్ఛామి అన్నందుకేమో!'

వెంకటప్పయ్య కీచురాయ్ కాస్సేపు సోవియట్ రష్యాపై మండిపడ్డారు. ఇంతలో ఎక్కడనించో సమీపం నుంచే 'తందనానా లాహి తందనానా బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మ మొక్కటే' అన్న అన్నమాచార్యుల కీర్తన వినిపించింది కర్ణ కఠోరంగా. గద్దర్ పాటలు చెరబండరాజు గీతాలు వినపడాల్సిన ఇంటిపరిసరాల్లో అన్నమాచార్యులకీర్తన అందులో రాజూ బంటూ ఒకడే, ఛండాలుడూ బ్రాహ్మణుడూ నడిచే వీధి ఒక్కటే అంటూ ఇంకా ఏమో ప్రిమిటివ్ కమ్యూనిజం లాటిది బోధిస్తున్నాడు. హిందూ ఆధ్యాత్మక వాదం అంటే దేంట్లో ఓ దాంట్లోకి ఎస్కేపిజం కదా.

'స్టూపిట్, స్టాప్ ద నాన్సెన్స్' అన్నాడు కోపంగా.

ఆ పాడుతున్నది వెంకటప్పయ్య కూతురే. నాయనమ్మ పూర్వకాలపు చాదస్తపు మనిషి. ఆవిడ రహస్యంగా తెచ్చి విశ్వనాథ నవలలు చదువుతూ ఉంటుంది. వేయిపడగలు ఆవిడ ఎన్నిసార్లు చదివిందో లెక్కలేదు. బ్రాహ్మలకు దండం పెడుతుంది, దక్షిణ ఇస్తుంది. పూజా పునస్కారాలంటూ మనవరాల్ని తన చుట్టూ తిప్పుకుంటుంది. హిరణ్య కశిపుడికి ప్రహ్లాదుడిలా వెంకటప్పయ్యకీ సంగీత సరస్వతి.

'పాడవే వాడి మాటలకేంగాని! అంది బామ్మ.

'తందనానా భళారే తందనానా' మామ్మగారి కిష్టం.

హిందూ ఆధ్యాత్మికంతో దేన్ని జోడించినా అది ఖరాబవుతుందని వెంకటప్పయ్య తీర్పు. అన్నమాచార్యులు రాజుబంటు, బ్రాహ్మడు ఛండాలుడు అంతా ఒకటే అన్నాడు. ఎవరిదృష్టిలో? భగవంతుడి దృష్టిలో. భగవంతుడే లేడు పొమ్మంటూంటే మళ్ళీ 'భగవంతుని దృష్టి ఎక్కడ' వెంకటప్పయ్యకి.

పాట ఆగింది. 'చాలా బ్రహ్మాండంగా పాడారండీ మీ అమ్మాయి' అన్నాడు కీచురాయి.

'ఏమిటి బ్రహ్మాండం? పాటా, సంగీతమా దాని మీనింగా?' అని గర్జించాడు వెంకటప్పయ్య.

'పాటకూడా చాలా బాగుంది. మీనింగూ దాని సంగీతమూ-అందులో మీ అమ్మాయి, ఏదమ్మా యింకోటి పాడు' అన్నాడు కీచురాయి నోరుజారి.

'నేను వద్దంటూవుంటే నువ్వు పాడమంటావు. ఏమిటి నీ ఉద్దేశం? నేను వెర్రి వెంగళప్పనీ అక్కడికి నువ్వు రసజ్ఞుడివినా?'

'అదికాదు హీటయిపోకండి గురువు గారూ! భక్తి సంగీతం కానిది ఉందనుకోండి. నేటిసినిమా సంగీతం మీరు అప్రిసియేట్ చెయ్యగలరా?'

'అది పెట్టుబడి దారీ అమెరికన్ సామ్రాజ్యవాదుల తొత్తు సంగీతం-ఆఫ్రికన్ రిథమిక్ బీట్స్ నాకు నచ్చదు. అదివాళ్ళకు ప్రాచీనం అయితే కావచ్చు. ఐ డోంట్ లైకిట్.'

'నాయినా నువ్వు ఉప్పుడు పిండి తింటావా? ఈవాళ శనివారం నాకు' అంది వెంకటప్పయ్య తల్లి.

'నో అబ్జెక్షన్. ఉప్పుడు పిండి అంటే నాకిష్టం.'

'నువ్వు అలా ఇంటికి వచ్చిన వాళ్ళని ఉప్పుడు పిండి తింటారా అని అడగటం అస్సలు నువ్వెందుకమ్మా నా గెస్టుల్ని ఇబ్బంది పెడతావు మధ్యలో. నీకు శనివారం అయితేనేమి కాకపోతే నేమి? ఆయన్నెందుకు ఇబ్బంది పెడతావ్. బయటికి పోయి చికెన్ బిర్యానీ తింటాడు. నీ ఉప్పుడు పిండి తినడు. ఏమిటండీ?'

'ఇదీ తంతు నాయనా? ఎవరైనా ఇంటికి వస్తే పలకరించి ఏదైనా పెట్టడం మర్యాద అవునా కాదా? ఉప్పుడు పిండి పెడతానంటేనే ఇంత గొడవ చేస్తున్నాడు. ఈవాళ శనివారం, ఆంజనేయస్వామికి చిట్టిగారెలొండాను. తింటావా అని అడిగితే ఏమంటాడో?'

'గురువుగారూ భోజనం దగ్గిర హేతువాదం వద్దు. మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానం భోంచేసిన తర్వాత. అమ్మా వడ్డించండి వస్తా. పాయసం కూడా ఏవన్నా చేశారా?'

'ఆవిడ బూర్జువా ధోరణి అంతే. ఆవిడ భావాలు మనతో కలియవు-గనుక నువ్వావిడ పెట్టినా తినడానికి వీల్లేదు. ఆ చెత్తంతా' అన్నాడు వెంకటప్పయ్య.

'చూడునాయనా ఉప్పుడు పిండి చిట్టి గారెలు, పాయసం చెత్తట. వీడి కమ్యూనిస్టు మాటలు ఏవిటట?' అంది తల్లి కూడా రెచ్చిపోయి. కీచురాయ్ ఇరకాటాన పడ్డాడు. మనకు భోజనం పెట్టిన వారి భావాలతో మనకి సంబంధం లేదు కదా!

'అమ్మగారు ప్రేమతో పెట్టినది తినకపోతే ఆవిడ ఏమన్నా అనుకుంటారు?'

'వర్గ శత్రువుతో రాజీ మాటలేమిటి? రావయ్యా' అని చిట్టిగారెలు తిననివ్వకుండా లేవదీసుకుపోయాడు కామ్రెడ్ వెంకటప్పయ్య. ఉసూరుమంది కీచురాయ్ ప్రాణం. మనకు తిండి పెట్టేవారందరికీ భావసారూప్యత వుండాలంటే ఎలా కుదుర్తుంది?

కీచురాయ్ మళ్ళీ దారిలో వెంకటప్పయ్యని అడిగాడు.

'సరే నేనీవాళ మానేశాను తినడం మరి రోజూ మీకెల్లాగ? మీ అమ్మగారు వండితే తినరా?'

'నాకు మా అమ్మ వండితేనే ఇష్టం'.

'మరి నాకో రూలూ మీకో రూలూనా?'

'వర్గ శత్రువు పెట్టే తిండి తినడం నాఖర్మ- తప్పదు మరి. మీకెందుకా కష్టం అని తప్పించాను.'

'ఏడిశారు' అని లోపల అనుకోబోయి పైకి అనేశాడు. కీచురాయ్‌కి ఉరుమురిమి మంగలం మీద పడ్డట్లు అయింది.

'వ్వాడ్డాయు మీన్' అని అరిచాడు వెంకటప్పయ్య.

'హేతువాదం భౌతిక వాదం నాస్తికత్వం ఇవి సమాజంలో వ్యక్తుల ప్రవర్తనని శాసిస్తాయి కాని మీలాగ తినడానికి తాగడానికి అన్వయించేవాళ్ళని నే నెక్కడా చూళ్ళేదు' అని కాస్త కటువుగానే అన్నాడు కీచురాయ్.

లోపల సంతోషిస్తూ 'మరేమిటనుకున్నారు? కేపిటలిస్టు సైకిల్మీంచి పడ్డాడనుకోండి. మనం అయ్యో అనకూడదు. చూసీ చూడనట్లు వుండాలి. కమ్యూనిస్ట్ కానివాడు పోయాడనుకోండి. రామ రామ అని అనకూడదు. ఒక బూర్జువా ఇంట్లో దొంగలు పడ్డారనుకోండి. అల్లాగా అని ఊరుకోవాలి. వీలయితే దొంగల తెలివితేటల్ని చాకచక్యాన్ని మెచ్చుకోవాలి. వాళ్ళ పెద్ద ఫ్యాక్టరీ కాలిపోయిందనుకోండి. మనం అయ్యో పాపం రామరామ అంటూ సానుభూతి ప్రకటించకూడదు. రోగం కుదిరినందుకు సంతోషించాలి. హేతువాదులు కమ్యూనిస్టులు ఎలా వుండాలో ఒక పుస్తకం రాద్దామనుకుంటున్నానోయ్' అని ఇటూ అటూ చూసాడు. కీచురాయ్ ఎక్కడా కనపడలేదు. మాయమయ్యాడు.

తిండిదగ్గర సంప్రదాయవాదులు భావాల్లో మార్క్సిస్టులు నా దగ్గరా వేషాలు! వెంకటప్పయ్య పకపకా నవ్వాడు.

వెంకటప్పయ్యకి జలుబు చేసింది. కొండవాళ్ళు దాన్ని కొండ జలుబు అంటారు. ఆ

జలుబుని ఏనుగు జలుబు అని కూడా అంటారు. అది ఉన్నన్నాళ్ళూ వెంకటప్పయ్య మనిషి కాడు. తలకు మఫ్లర్ చుట్టుకుంటాడు. ఫ్యానల్ చొక్కా ఊలు స్వెట్టర్లు ధరించి వైట్ పైజమా వేస్తాడు. లుంగీలు కొన్నాళ్ళు వేసి మానేశాడు. ఆ జలుబు వెర్రిక్కించేసి నప్పుడు అతను గావు కేకలు వేస్తాడు. తిడతాడు. అరుస్తాడు. తనకు కావలసిన వాళ్ళని అక్కర్లేని వాళ్లను కూడా కేకలేస్తాడు. కేకలెయ్యడమంటే ఇంగ్లీషులో తిట్టి వూరుకోవడం కాదు. తెలుగులోకి సంస్కృతంలోకి దిగిపోతాడు. జలుబు చేసినపుడు ఎవరికైనా సంస్కృతమే గతి.

మేష్టారికి దయ్యం పట్టింది అని అనలేరు కాని పాపం మేష్టారిని జలుబు అప్‌సెట్ చేసింది అని కుర్రకారు ఇటూ అటూ సర్దుకుంటారు.

అటువంటప్పుడు తియాన్ మన్‌స్క్వేరు బీజింగ్‌లో డెమాక్రసీ కావాలని పట్టుబట్టిన స్టూడెంట్లను పాపం కాల్చేశారట అని ఎవరేనా అంటే-పాపం అన్నందుకు మిమ్మల్ని కూడా అందులో వేసి కాల్చేసెయ్యాలి. డెమాక్రసీ ఏవిటి? డిమాక్రసీ-అంటే అమెర్కన్ జుత్తులూ సినిమాలూ పిక్చర్లూ పుస్తకాలు షోకులూ అన్నీ దిగిపోతాయన్నమాట. కాల్చేసెయ్యాల్సిందే నంటాడు.

అల్లా అన్లేదు కాని, మాస్టారూ గోర్బచేవ్ కమ్యూనిస్ట్ పార్టీని రద్దు చేశాట్ట. ఇక ఎఱ్ఱ బావుటా నిగనిగలు హెూమజ్వాలల భుగభుగలూ-అంటూండగానే వెంకటప్పయ్య జలుబు ఉధృతంలో పెద్ద పెద్ద రాళ్ళలాటివి ఏవో ఎత్తి విసిరేశాట్ట ఎదురుగుండా వున్న తోటలోకి. ఆ తోటలో కొన్ని మొండి చెట్లు వున్నాయి. కూలిపోయి, అవికాస్త చీకటి పడితే మొండివిగ్రహాల్లా గోచరిస్తాయి.

ఏనుగు జలుబు చేసినపుడు మాస్టారికి అని ఎలిట్సిన్, గోర్బచేవ్ విగ్రహాల్లా కనుపించి స్టాలిన్ రచనలు కమ్యూనిస్ట్ పార్టీ చరిత్ర ఇంకా చరిత్ర యింకా చాలా సోవియట్ పుస్తకాల్ని విసుర్తూనే వున్నాట్ట.

'ఒక హేతువాది కమ్యూనిస్ట్ కార్యకర్త మా గురువు గారికి జలుబు చేస్తే ఇంత గొడవ చేస్తున్నారు' 'సాక్షాత్తూ లెనిన్ గారికే జలుబు చేస్తే –' అని కిటికీలోంచి తొంగి చూస్తూ విష్‌చెయ్యకుండా కీచురాయ్ అనుకున్నాడు లోపల.

'జలుబు కేం జలుబు వారం రోజుల్లో తగ్గుతుంది కాని మళ్ళీ కమ్యూనిజం రాదు కదా రష్యాలో' అని చేయెత్తి సూర్యనమస్కారం చేసింది వెంకటప్పయ్య తల్లి.